


# నేనూ నా సెల్‌ఫోనూ

డా. టి. మహాదేవ్‌రావు

కైలాసగిరి వ్యూ పాయింట్‌లో సిమెంట్ బెంచిపై కూర్చున్నా నా ఆలోచనల తేనెటీగలు నన్ను ప్రశాంతంగా వుండనీయడం లేదు. మొదటిసారి సెల్‌ఫోన్ చేతిలో తీసుకున్నప్పుడు వున్న ఉత్సాహం, ఉద్విగ్నతల బదులు నిరాశ నిస్పృహలు కమ్ముకున్నాయి. దూరంగా సముద్రం, కొండలు కలిసే చోటును చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్న నాకు కొద్ది సమయం క్రితం జరిగిన సంఘటనలూ దానికి కారణమైన సెల్ ఫోనూ పదే పదే విచలితుణ్ని చేయసాగాయి.

ఈ సెల్‌ఫోన్ కనిపెట్టిందెవరో గాని మహానుభావుడు ఇలా ఇరుకున పడేసి మనుషుల జీవితాలతో ఆడుకుంటాడని అనుకోలేదు. సెల్‌ఫోన్ కొత్తగా నా దగ్గరకు వచ్చినప్పుడు అదే నాలుగేళ్ల క్రితం వున్న ఆనందం, ఉత్సాహం అంతా ఆవిరయిపోయి మనిషిని ఇప్పుడు ఆవిరి కుడుంలా మార్చేసాయి. సెల్‌ఫోన్ చేసిందేమిటి? మనల్ని చాలా ఎక్కువ ఆత్మవిశ్వాసంతో నింపేసి మనిషిలో సమూలంగా మార్పులు తెచ్చి మార్చేస్తాయి. అప్పుడు మనమే కదా దాన్ని ఆసరాగా తీసుకొని రవాణాసురుడిలా అతి ఆత్మవిశ్వాసంతో నోటికొచ్చిన అబద్ధాలన్నీ పేలి ప్రాణం మీదకి తెచ్చుకుంటున్నాం.

నేను కూర్చున్న బెంచీ పక్కనే గుబురుగా వున్న పొదల్లోంచి రకరకాల రింగ్ టోన్లతో సెల్‌ఫోన్లు మోగుతూ నన్ను సెల్‌ఫోన్ గురించి పదే పదే గుర్తు చేస్తూ అతి ఆత్మవిశ్వాసంతో నిండిన నన్ను ఈ స్థితికి తీసుకొచ్చిన నా గతాన్ని గుర్తుకు తెస్తున్నాయి.

నేనయితే సెల్‌ఫోన్ కొనకపోదును. కానీ ఓ క్విజ్ కార్యక్రమంలో నేను రాసిన కరెక్ట్ సమాధానాలకు ప్రథమ బహుమతిగా ఆ కంపెనీ సెల్‌ఫోన్ ఇచ్చింది. సర్లే ఫ్రీయే కదా అని తీసుకొని ఇప్పటికి నాలుగేళ్లయింది. కమ్యునికేషన్ల రంగంలో మనం ఎంత ఎత్తుకు ఎదిగిపోయామో కదా అని సంబరపడిపోతూ సెల్ ఫోన్ వాడడం మొదలుపెట్టాను. అలా అని బిల్లు కట్టడం లేదనుకునేరు. ఠంచనుగా కట్టేవాడిని.

మొదట్లో బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ వల్ల వచ్చే లాభాల్లా సెల్‌ఫోన్ లాభాలు చాలా చాలా బాగుండేవి. నడిపిన ప్రతి పావూ విజయం వైపు పయనించేది. చేసిన ప్రతి పనీ, ఆడిన ప్రతీ మాట, ప్రతీదీ మన గెలుపే అన్నట్లుండేది. సెల్‌పోన్ అయితే నాకు విష్ణువు చేతిలో సుదర్శన చక్రంలా అనిపించేది. ఎక్కడున్నా క్రింది ఉద్యోగుల్ని నియంత్రించాలన్నా. పై అధికారులతో సంభాషించాలన్నా చాలా ఉపయోగకరంగా వుండేది. ఈ ఉపయోగాల వల్ల, పొందుతున్న గెలుపుల వల్ల ఆత్మవిశ్వాసం బాగా బాగా పెరిగిపోయి హనమంతుడి ఆకారంలోకి మారి నాలో వున్న ఆత్మవిశ్వాసాన్ని అతి ఆత్మవిశ్వాసంగా మార్చిపారేశాయి. ఈ అతి ఆత్మవిశ్వాసం మనకు తెలియకుండా మన శరీరంలో మలేరియా చేరినట్లు చేరింది. ఆ తర్వాత చలిజ్వరం గట్రా రాలేదు గాని పరిస్థితులు తారుమారయ్యే అవకాశాలెక్కువయ్యాయి.

నా సతీమణి ఫోన్ చేస్తే బాసుతో అర్జెంట్ మీటింగ్‌లో వున్నానని చెప్పేవాడిని. ఆ సమయంలో నా లేడీ సెక్రటరీతో కాఫీ హౌసులో హ్యాపీగా కాఫీ తాగుతుండేవాడిని. మా వారు అలసి సొలసి పని చేస్తూ, మమ్మల్నెంత సుఖపెడుతున్నారో అనుకునేది మా ఆవిడ. అక్కడ అలా మార్కులు పడిపోయేవి.

సాయంత్రం ఏడు గంటలకి బార్లో స్నేహితులతో కూర్చుని మందు ఇక మొదలుపెడదాం అనుకునేటప్పటికి బాస్ ఫోన్ వచ్చేది. ఇంట్లో వున్నాను సార్. రేపటి మీటింగ్ కోసం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు తయారు చేస్తున్నానని చెప్పేవాడిని. బాస్ వెరీ గుడ్ అని ఫోన్ పెట్టేసేవాడు. ఇక్కడా మార్కులు పడిపోయేవి. ఆ ఆనందంలో మరో రెండు పెగ్గులు ఎక్కువ దిగేవి గొంతులో.

ఓసారి ఓ పాత గర్ల్ ఫ్రెండ్ ఫోన్ చేసింది. అప్పుడప్పుడు కలిసి తిరిగేవాళ్లం. ఆమె వస పిట్టలా ఏదో ఒకటి వాగుతూ వుండేది. ఏవేవో చెప్పేది. ఏవేవో కొనమనేది. మొన్ననే చెవిరింగులు కొంటానని మాటిచ్చా. బహుశా అందుకే ఫోన్ చేసి వుంటుంది. ఆఫీసులో బాసు దగ్గర వున్నానని చెప్పి ఫోన్ కట్ చేసాను.

బీచ్‌లో పక్కనే కూర్చుని వున్న స్నేహితుని చేతిలో వున్న పొట్లం నుంచి ముర్రి మిక్చర్ తీసుకొని తినసాగాను. ఎవర్రా అని అడిగాడు వాడు. ఉందిలే ఒక సుందరాంగి ఏదేదో కొనమంటుంది. ఈ నెల జీతం రావడానికింకా నాలుగు రోజులున్నాయిగా, డబ్బులే వుంటే ముర్రి మిక్చర్ తినే ఖర్మ మనకేం? హాయిగా తలశిలలో రెండేసి పెగ్గులు వేసుకునే వాళ్లంగా... మిత్రుడు కూడా నవ్వులో నాతో వంతకలిపాడు. తోడుదొంగలం కదా మరి.

అలా చెప్పిన ప్రతి అబద్ధం గెలుపుకి తొలి మెట్టుగా ప్రగతి పథానికి సోపానంలా, చేస్తున్న ప్రతి పనీ అది మంచయినా, చెడయినా, అనవసరమయినా, సబబేననిపించేది. అదే పంథాలో కొట్టుకుపోసాగాను. ఇలా ఓ విజేతలా జీవితపు క్రికెట్టులో వెలుగొందుతున్న తరుణంలో జరిగిన కొన్ని సంఘటనలు సూపర్ ఎయిట్కి చేరకముందే ఇంటికి చేరుకున్న భారత్ క్రికెట్ జట్టులా మార్చాయి నా జీవితాన్ని.

మొన్న ఓ రోజు రైల్వే స్టేషన్ కౌంటర్‌లో మరిచిపోయిన నా సెల్‌ఫోను ఇంటికి వచ్చాక గాని గుర్తుకు రాలేదు. వెంటనే వెళ్లి చూసుకున్నా. దొరకలేదు. ఎలా దొరుకుతుంది? మీ పెన్ను తీసుకొని మీకు ఎంతమంది తిరిగిస్తారు? అదీ అడిగి తీసుకున్నది. మరి సెల్‌ఫోను అది అనామకంగా అప్పనంగా. ఎదురుగా తీస్కో బాబూ అన్న రీతిలో వుంటే, మనకు దొరుకుతుందని ఆశపడడమనేది అత్యాశేగా.


ఆ రోజంతా నిత్యం మందు కొట్టేవాడికి సాయంత్రానికి మందు పడకపోతే ఎలా అలమటించి, చిరాకు, చీకాకు పడతాడో అటువంటి అవస్థ పడసాగాను. అలవాటు పడ్డ ప్రాణం సెల్‌ఫోను లేక గిల గిలా కొట్టుకోసాగింది. గత్యంతరం లేక పాత సెల్‌ఫోను నెంబరు బ్లాక్ చేసి కొత్త సెల్ ఫోను కొన్నాను.

ఆ సెల్ ఫోను పోవడం, నా జాతకం మారటం, నేను బంగ్లాదేశ్‌తో ఓడిపోయిన భారత క్రికెట్ జట్టులా అయిపోవడం అన్నీ ఒక్కసారే జరిగాయి. సెల్ ఫోను పోయాక ఒక రోజంతా చాలా కోల్పోయినట్లయింది. మన శరీరంలో ఏదో అవయవం పోయినట్లు బాధ. తెలియని అనిర్వచనీయమైన బాధ. అదే అప్పులోడు అప్పు తీర్చమని వెంటపడినప్పుడు, ప్రేమించిన అమ్మాయి పెళ్లిచేసుకొమ్మని వేధిస్తున్నప్పుడు, ఎన్ని మందులు వాడినా తగ్గని రోగం పెట్టే బాధ కన్నా ఎక్కువ బాధించింది ఆ రోజంతా.

ఆ మధ్య సెల్‌ఫోన్‌లో శ్రావ్యమైన మధుర కఠం గల ఓ అమ్మాయి ఫోన్ చేసి నాకేదో లాటరీ తగిలిందని, ఆ ప్రకారంగా నేను నా కుటుంబసభ్యులంతా ఐదు తారల హోటల్లో డిన్నర్‌కి ఆహ్వానింపబడినట్లు, చిరునామా వివరాలన్నీ చాలా ప్రేమగా చెప్పింది. పత్నీసమేతంగా వెళ్లా. వాళ్ల రిసార్ట్‌లో మదుపు పెట్టమని ఆ హొయలాడి డిన్నర్ తరువాత చర్చల్లో అడిగింది. మా ఆవిడకి కంప్యూటర్లో ఆ రిసార్ట్‌ని ఒక స్వర్గంలా చూపేసరికి, ఆవిడ మదుపు పెట్టమని ప్రాణాలు తోడేసింది. అక్కడ పెట్టిన డబ్బుల్తో ఓ ముప్ఫై సెల్‌ఫోన్లు సునాయసంగా కొనుక్కోవచ్చు. రశీదు పుచ్చుకుని ఇంటి దారి పట్టాం. వాళ్ల బిజినెస్ ప్రమోషన్‌గా డిన్నర్‌కి పిలుస్తుంటారని తర్వాత తెలిసింది. అయితే అప్పటికే ఆలస్యమయిపోయింది. దానికి మా ఆవిడ అతి ఉత్సాహం కూడా ఓ కారణం. వాళ్ల స్నేహితురాలికి నా సెల్‌ఫోన్ నెంబరు ఇచ్చిందట. అది అలా అలా పయనించి ఇలా గమ్యం చేరింది.

వారం పోయాక ఆ కంపెనీ బోర్డు తిప్పేసిందని తెలిసి భార్యాభర్తలం ఒక్కసారిగా జీవితంలో మొదటిసారిగా ఐకమత్యంగా లబోదిబోమన్నాం. ఇది ఆ శ్రావ్యమైన గొంతు నిర్వాకం. సెల్‌ఫోను వల్లే కదా ఇది జరిగిందని అనిపిస్తుంది ఇప్పటికీ.

సెల్ ఫోన్ వచ్చాక అబద్ధాలు ఆశువుగా ఆడేస్తూ, ప్రతి వాణ్ని మాటల తూటాల్తో చంపేస్తూ, అతి ఆత్మవిశ్వాసం పొంగి పొర్లుతున్న నేను ఓ రోజు మాంచి మూడ్‌లో నా మిత్రురాల్ని తీసుకొని షాపింగ్ మాల్‌కి వెళ్లాను. తన పుట్టినరోజు సంద



ర్భంగా ఒక మంచి చీర ఆమెకు కొని ప్రజెంట్ చేద్దామని, కారు దిగుతుండగా సెల్ మోగింది. మా ఆవిడ ఫోను. ఆఫీసులో ఉన్నాను బాసుతో, తీరికయ్యాక ఫోన్ చేస్తానని కట్ చేసా.

గంట పైగా గడిచిపోయింది. నా మిత్రురాలికి ఒకటంటే ఒక చీర నచ్చితే ఒట్టు. నాకైతే పిచ్చెక్కుతుందేమోనని పించింది. ఈ షాపుల వాళ్ల ఓర్పుకి జోహార్లర్పించకుండా వుండలేకపోయాను. గంటన్నరయాక ఒక చీర నచ్చింది మహాతల్లికి. హఠాత్తుగా ఎవరో చూస్తున్నారనిపించింది. వెనక్కి తిరిగి చూసా. మా ఆవిడ కారాలు మిరియాలు నూరుతూ అపరకాళిలా నిలబడి నన్ను, నా పక్కన వున్న మిత్రురాల్ని మార్చి మార్చి చూసి ఇదేనన్న మాట మీ ఆఫీసు,,,, ఇంటికి రండి అంటూ తీసుకొన్న చీరల బ్యాగులు పట్టుకుని విసవిసా వెళ్లిపోయింది.

ఆ తర్వాత వారం రోజుల వరకూ పద్దెనిమిదిరోజులు జరిగిన మహాభారత యుద్ధం మా ఇంట్లో జరిగేది. మా ఇంటి చుట్టుపక్కల వాళ్లు టీవీ సీరియళ్లు వదిలేసి రోజుకో రెండు ఎపిసోడ్లు చొప్పున వారమంతా సీరియల్ కురుక్షేత్ర యుద్ధాన్ని మా ఇంటి కిటికీ గుండా చూసి ఆస్వాదించి ఆనందించారు. అప్పుడు నాకు అర్థమయింది టీవి సీరియళ్లు ఎలా తీస్తారోనన్న నిజం. టీవీ సీరియళ్ల నిర్మాణానికి ఆధారం సెల్ ఫోన్లేనని నా గట్టి నమ్మకం.

ఈ బాధ ఇక మరిచిపోతున్నాను అనుకుంటుండగా మరో బాధ వచ్చి, గిచ్చి, చచ్చేట్లు చేసింది. ఆ రోజు బాసు సెలవులో ఉన్నారు. మధ్యాహ్నం నా లేడీ సెక్రటరీ పిజ్జా తిని కాఫీ తాగుదామని ముద్దుగా గోముగా అడిగేసరికి కాదనలేకపోయాను. ఆఫీసు నుంచి గంట ముందుగా బయలుదేరుతుంటే సెలవులో ఇంట్లో వున్న బాసు ఫోన్ చేసి ఏమి చేస్తున్నావని అడిగాడు. ఆఫీసులో పనిలో బిజీగా వున్నానని, కొత్త ప్రపోజల్స్ ఫైనల్ చేయడంలో నిమగ్నమయి వున్నానని చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పాను. సరే వెరీగుడ్ అని ఫోను పెట్టేసాడాయన. హుర్రా అనుకుంటూ కారులో సెక్రటరీతో బయలుదేరాను ఈల వేసుకుంటూ...



ఆఫీసు నుంచి గంట ముందుగా బయలుదేరుతుంటే సెలవులో ఇంట్లో వున్న బాసు ఫోన్ చేసి ఏమి చేస్తున్నావని అడిగాడు. ఆఫీసులో పనిలో బిజీగా వున్నానని, కొత్త ప్రపోజల్స్ ఫైనల్ చేయడంలో నిమగ్నమయి వున్నానని చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పాను. సరే వెరీగుడ్ అని ఫోను పెట్టేశాడాయన. హుర్రా అనుకుంటూ కారులో సెక్రటరీతో బయలుదేరాను ఈల వేసుకుంటూ...

పిజ్జా కార్నర్లో మూలగా వున్న టేబిల్ చూసుకుని కూర్చున్నాం. చుట్టూపక్కలా అంతా టీనేజి జంటలు. గుసగుసల్లో మునిగిపోయి వున్నాయి. మమ్మల్ని చూసి వెయిటర్ వచ్చి ఆర్డరు తీసుకెళ్లాడు. ఇక్కడ లభించే పదార్థాల గురించి, వాటి రుచి, వాటి వివరాల గురించి ఆమె చెపుతుంటే నేను ఆమెను చూస్తూ కూర్చున్నాను.

ఎవరో నా భుజం మీద చెయ్యేసారు. వెనక్కి తిరిగి చూసా, బాసు తన ఫ్యామిలితో పక్క టేబిలులో వున్నాడు. నేను, నాతో వున్న లీసా షాకయ్యాము. సునామీలో ఇరుక్కుపోయినట్లయింది మా పరిస్థితి. ఏం చేయాలో తోచకపోయినా బాసుకి, వాళ్లావిడకి విష్ చేసి వాళ్లబ్బాయి బుగ్గలుని మిరాను. బాసు కనుబొమలు ఎగరేస్తూ వాళ్లావిడను సంబోధిస్తూ 'ఈ అమ్మాయి లీసా, ఈయన సెక్రటరీ. ఈ అమ్మాయి గురించే నువ్వు నన్ను అనుమానించేదానివి. ఇప్పుడర్థమయిందా?' అన్నాడు. మిసెస్ బాస్ నా వైపు తిరిగి 'శైలజ లాంటి సలక్షణమైన భార్యనుంచుకొని ఇదేమయినా బావుందాండీ? ఛ... మీరిలాంటి వారనుకోలేదు' అని లీసా వైపు తిరిగేలోగానే ఆ అమ్మాయి హ్యాండ్ బ్యాగ్ తీసుకొని సర్రున వెళ్లిపోయింది. బాసు వాళ్లూ వేరేగా కూర్చుని నవ్వుకుంటున్నారు. మధ్య మధ్యలో బాసు నా వైపుకి తిరిగి వ్యంగ్యమైన మందహాసం విసురుతున్నాడు. ఇంతలో వెయిటర్ రెండు పిజ్జాలు తెచ్చాడు. ప్యాక్ చేసి కారులో పెట్టమని చెప్పి బాసుకి బై చెప్పి బయటపడ్డాను.

మనసంతా అల్లకల్లోలం అయిపోయింది. లీసా ఏమనుకుంటుందో? బాసు భార్య మా ఇంటికి ఫోన్ చేసి చెపితే... ఇప్పుడిప్పుడే అయిపోయిన కురుక్షేత్ర యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న ఆలోచనే మరీ ఇరకాటంలో పడేసింది. అవునూ తన భార్య తనకు తప్ప అందరికీ అంత మంచిదిగా, సలక్షణమైనదిగా ఎందుకు కనిపిస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కాని మిలియన్ డాలర్ల ప్రశ్న? అందరికీ అనసూయలా కనిపించే తన భార్య తనకు మాత్రం ఎందుకలా కనపడదో అర్థం కాదు. బుర్రంతా పాడయిపోయి ఇదిగో ఇలా వచ్చి కైలాసగిరి వ్యూపాయింట్‌లో కూర్చున్నాను. టీవి సీరియళ్లు ఎలా ఇన్ని ఎపిసోడ్లు తీయగలుగుతారో అర్థమవుతూంది.

పక్కనే వున్న పొదల్లోంచి సెల్‌ఫోన్ రింగ్ టోన్ వినపడసాగింది. నా సెల్‌ఫోన్ రింగ్‌టోన్‌లా వినపడేసరికి పొదల్లో వున్న వాళ్లను చూడడానికి ప్రయత్నించా. ఒక అబ్బాయి, అమ్మాయి గాలి కూడా దూరలేని విధంగా గడ్డిపైన కూర్చుని వున్నారు. అమ్మాయి సెల్ ఫోన్ మ్రోగుతోంది. ఆ అమ్మాయి మాటలు పైకి బాగానే వినిపిస్తున్నాయి. "అమ్మా ఎందుకు గాబరా పడతావు? ఇక్కడ గుడిలో వున్నాను. రద్దీ ఎక్కువగా వుంది. రావడానికో గంట పడుతుంది. వచ్చేస్తాలే. సరే." అని ఫోన్ పెట్టేసింది. ఈ లోగా ఆ అబ్బాయి అమ్మాయిని కౌగిలించుకోవడానికి ట్రై చేస్తున్నాడు. "ఓయ్ కాస్త ఓపికపట్టు అమ్మతో మాట్లాడుతున్నానా?" అంటూ ఆ అమ్మాయి అబ్బాయి ఒళ్లో పడుకుంది. అబద్ధాల అధ్యాయాలకు అంతే లేదా అని అనిపించింది నాకు. మనం ఎక్కువగా మాట్లాడేది అబద్ధమేనన్న విషయం మరో మారు రూఢీ అయింది.

అయినా ఆ అమ్మాయి అబద్ధం కాదు కదా చెప్పింది. పూజే కదా చేస్తుంది. అయితే దేవుడి పూజ కాకపోవచ్చు. ప్రేమ పూజయినా పూజే కదా. ఇక ముమ్ముందు ఈ పూజ వలన పుణ్యం వస్తుందో లేక భవిష్యత్తులో పాపం ఫలిస్తుందో, రాగల కాలమే చెప్పాలి. ఆ అమ్మాయికి సెల్‌ఫోన్‌లో చెప్పే అబద్ధాల వలన కలిగే అనర్థాల గురించి చెపుదామన్న కోరికను బలవంతంగా అణుచుకున్నా. ఇప్పటి నుంచే ఇన్ని అబద్ధాలాడితే ముమ్ముందు నాలా చాలా కష్టాలు అనుభవించాల్సి వస్తుందని అన్నాలనుకున్నా. కానీ స్వీయానుభవం వలన తెలుసుకోవాలి. వాళ్ల అమ్మ కైలాసగిరి పార్కులో వుండి వుండవచ్చు. ఆవిడే తెలుసుకోవచ్చు. అనుకుని మౌనంగా దూరంగా ఆకాశంలో ఎగురుతున్న పక్షుల్ని చూడసాగాను.

ఇంతలో నా సెల్ ఫోన్ రింగయింది. అదే మా అనసూయ వంటి సతీమణి ఫోన్. ఇక్కడ కైలాసగిరిలో వున్నాను. పావుగంటలో ఇంట్లో వుంటాను అన్నా. నిజమేనా? అని అడిగింది. అబద్ధాలు చెప్తే అందరూ నమ్మేస్తారు. నిజాన్ని ఎందుకు నమ్మరబ్బా అనుకుంటూ నిజమేలే మహాతల్లీ అని ఫోన్ ఆఫ్ చేసి మెట్లు దిగడం ఆరంభించాను.

ఇంతలో మళ్లీ ఫోన్ మోగింది. బాసు. అదే ప్రశ్న. ఎక్కడున్నావని? కైలాసగిరి పార్కని చెప్పా.. నిజమేనా? అని అడిగాడు. అవునన్నా. 'ఏ అమ్మాయితో వున్నావ్' అని రావణాసురుడిలా నవ్వాడు... నేనొక్కడినే వున్నాను సార్ అని చెప్పా. కోతలొద్దు, నిజం చెప్పమన్నాడాయన. నిజమేనని చెప్పా. సరే ఇకముందు ఎప్పుడూ నిజాలే చెప్పు. నిజాలే చెప్పాలి. అని అదే వికటాట్టహాసంతో ఫోన్ కట్ చేసాడాయన. సెల్ ఫోన్‌ని దీనంగా తదేకంగా చూస్తూ అనుకున్నాను. ఇంత చిన్న మిషను ఎంత పని చేస్తుంది కదా అని. సెల్ ఫోన్ నా వైపు చూసి వ్యంగ్యంగా నవ్వినట్లయింది.

★